క్లుప్తంగా

గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపు



చిత్రలేఖనం వేస్తున్న చిన్నారులు

నారాయణవనం: వేసవి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పిల్లలకు ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ జీవన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు వేసవి తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, గ్రామర్ తరగతులతో పాటు కథలు చెప్పడం, పిల్లలచే కథలు చెప్పించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీవన్ కోరారు.

స్కూళ్లకు చేరిన విద్యాసామగ్రి



బెల్ట్‌లను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు అందించేందుకు 2612 బెల్టులు గురువారం చేరినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు బెల్టులను పాఠశాలలు తెరచిన వెంటనే అందజేస్తామన్నారు. ఇప్పటికే నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు పాఠశాలకు చేరాయని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కొండయ్యకు ఘన సన్మానం



కొండయ్య దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన కొండయ్య రిటైర్డు తహసీల్దారు జయచంద్ర, డీటీలు చంద్రబాబునాయుడు, అశోక్, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కొండయ్య దంపతులను శాలువతో సత్కరించి, గజమాలను వేసి, జ్ఞాపికలను అందజేశారు. ఆయన గత 30 ఏళ్లుగా పైగా తహసీల్దారు కార్యాలయంలో అంకితభావంతో పని చేశారని, ఆయన వృత్తి పట్ల గౌరవంగా ఉన్నారని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మురళీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల రథసారథి సీఐటీయూ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: కార్మికుల ఐక్యపోరాటాల రథసారథి సీఐటీయూ అని జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుల్లయ్య మాట్లాడుతూ 1970 మే 30న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తా నగరం వేదికగా ఐక్యపోరాటం అనే నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. మోదీ పాలనలో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. 44 కేంద్ర కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని మండిపడ్డారు. ఆర్టీసీ మనుగడకే ప్రమాదకరమైన మోటార్ వాహన చట్టానికి సవరణ చట్టం చేసిన బీజేపీకి, వంతపాడే కార్పొరేట్ శక్తులు, రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడేందుకు కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, అన్వర్‌బాషా, వెంకటేష్, రాజా, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



భాస్కర్ నాయక్

నారాయణవనం: ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులు, సంబంధిత పార్టీ శ్రేణుల విజయోత్సవ సంబరాలు జరపడానికి అనుమతులు లేవని పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్‌నాయక్ స్పష్టం చేశారు. గురువారం నారాయణవనం ఎస్‌ఐ లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జూన్ 4న మంగళవారం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సర్కిల్ పరిధిలో నారాయణవనం, కేవీబీపురం, పిచ్చాటూరు, వడమాలపేట మండలాల గ్రామాలు ప్రశాంతంగా ఉండాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ యాక్ట్‌తో పాటు 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్న కారణంతో సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు ఎక్కడా నిర్వహించకూడదని ఆయన హెచ్చరించారు. జూన్ 3 నుంచి 5 వరకు మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధమన్నారు.

గంగమ్మా.. కాపాడరావమ్మా

- మరగాళ్లు.. వేపచీరలు.. భక్తిపరవళ్లు..అన్నదానాలు
- మొక్కులు చెల్లించిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



సత్యవేదు గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ దంపతులు

సత్యవేడు: గంగజాతర వేడుకల్లో యువకులు, పిల్లలు, గంగమ్మకు, మరగాళ్ల నృత్యం, వేపచీరలు మొక్కులను చెల్లించడం ఆనవాయితీ. గంగమ్మను దింపే ముందు, సాగనంపే సమయంలో ఈ మొక్కులు చెల్లిస్తారు. సత్యవేడులో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు గురువారం ఉదయం 8 గంటల వరకు సాగింది. పర్ణశాలలో గంగమ్మను ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామ పరిధిలో అష్టబంధనం కట్టిన వీధుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కరగాటం నృత్యప్రదర్శనలు చేశారు. నృత్యం చేస్తున్న యువకులకు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. మరగాళ్ల నృత్యం(ఒంటికి నిమ్మకాయలు, దారాలతో గుచ్చుకుని, కాళ్లకు చెక్కలు కట్టుకుని డప్పు మోతకు అనుగుణంగా నృత్యం చేయడం) ఆకర్షణ.

వేపచీర మొక్కులు

కోరిన కోర్కెలు తీరిన వారు, అనారోగ్యం నుంచి కోలుకున్న వారు వేపచీర(వేపాకు శరీరానికి చుట్టుకుని) పొర్లుదండాలు పెడుతూ అమ్మవారికి పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు.

మట్టి విగ్రహానికే అలంకరణ

గంగమ్మ రూపాన్ని బంకమట్టితో గ్రామ కుమ్మరి ప్రత్యేకంగా తయారు చేశారు. మట్టి విగ్రహానికి గ్రామ రజకుని ఇంట విశేష అలంకరణ చేశారు. తప్పెట్లు, వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ రజకులు వంతుల వారీగా అమ్మవారిని మోస్తూ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి వీధుల మలుపుల వద్ద కర్పూర హారతులు పట్టారు. మహిషాసుర మర్ధిని రూపంలో అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిగా తరలివచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

పానీయాల పంపిణీ

ఆలయ సమీపంలో జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కే.మోహన్ రెడ్డి ఎండలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు లస్సీ, పాల ఉత్పత్తి పానీయాలను పంపిణీ చేశారు. ముదిరాజ్ సంఘం, బలిజ సంఘం, దేవాంగ సంఘం, వీరభద్రస్వామి ఆలయ నిర్వాహకులు 5వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న నూకతోటి

నడివీధిలోని పర్ణశాలలో కొలువుదీరిన గంగమ్మను పార్టీ నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ దంపతులు దర్శించుకున్నారు. వీరితో పాటు తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రమేష్, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలుగుదేశం నాయకులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు.





వేపచీర మొక్కు చెల్లించేందుకు గంగమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు, గంగమ్మ భక్తులకు పానీయాలు అందజేస్తున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

ఘనంగా గంగమ్మ జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

- సారె సమర్పించిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఆకర్ష్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో పలు పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం చేసి, విశేషంగా అలంకరించారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీ సిపాయి, ఆకర్ష్ రెడ్డి పూజలు

మండలంలోని వికృతమాల గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకర్ష్‌రెడ్డి గురువారం పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆహ్వానం మేరకు వారు జాతర సంబరాలకు వేర్వేరుగా హాజరై, సారె సమర్పించి, ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, సర్పంచులు రుక్మిణి, జయముని, నాయకులు యల్లప్పరెడ్డి, ఢిల్లీబాబు, బాలరెడ్డి, మునిరెడ్డి, గిరి, గురునాథం, రామ్మూర్తి, పెంచలయ్య, సురేష్, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకరణలో గంగమ్మ



సారెను తీసుకుని వెళుతున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

మధ్యాహ్న భోజనంలో మరింత నాణ్యత ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

ఏర్పేడు: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనపరంగా మరింత నాణ్యతను పాటించాలని డీఈఓ శేఖర్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టాలని భోజన నిర్వాహకులకు చెప్పారు. మెనూ ప్రకారం బలవర్ధకమైన ఆహారం పెట్టాలని, విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం డీలర్ల నుంచి గ్రీన్ లేబుల్ కలిగిన బియ్యం బస్తాలను తీసుకోవాలన్నారు. పిల్లల శారీరక ఎదుగుదలకు ప్రభుత్వం మంచి ఆహారాన్ని అందిస్తున్న చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమలత, ఎంఈఓ–2 దయాకర్ రావు, సీఆర్పీలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



పిచ్చాటూరు: వంటల పోటీలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

పిచ్చాటూరు: ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ హేమమాలిని సూచించారు. గురువారం కీళపూడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్యాస్, పాత్రలు వంటసామగ్రి వస్తువులు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం పోషక విలువలతో కూడిన వంటల తయారీ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన కార్మికులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 యుగంధర్ రాజు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏర్పేడు : మండలంలోని ఏర్పేడు–కోబాక రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. ఆరులేన్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని నూతనంగా ఓ వంతెన నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికుడిగా గ్రామస్తులు భావిస్తున్నారు.

పోలేరమ్మ జాతర ఆదాయం రూ.6.11 లక్షలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను విజయవంతం కావడంపై దేవదాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ.4,27,882 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగిందన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

ఏర్పేడు: యువత మత్తుకు బానిసలు కారాదని పాపానాయుడుపేట మత్తు బానిసల పునరావాస కేంద్రం ప్రాజెక్ట్ అధికారి అన్నాదొరై అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, యువత మద్యం, పొగాకు, ధూమపానానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్ మహమ్మారి బారిన పడి తక్కువ వయసులోనే చనిపోవడానికి అవకాశం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని వాటికి వాడకానికి స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాపానాయుడుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మత్తు బానిసల పునరావాస కేంద్రం సిబ్బంది

వసంతోత్సవంలో కల్యాణ వెంకన్న



వసంతోత్సవంలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి గురువారం సాయంత్రం స్వామి వారు శ్రీదేవీ, భూదేవీ సమేతుడై వసంతోత్సవంలో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్న భక్తులపై పరిచారకులు సుగంధ పరిమళ ద్రవ్యాన్ని చిలకరించారు. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణమైన మరుసటి రోజు సాయంత్రం వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలు, గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీవారు ఉభయ నాంచారులతో తెల్లటి పట్టువస్త్రాలను, స్వర్ణాభరణాలను, సుగంధ పుష్ప మాలికలు అలంకరించుకుని తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. మాడవీధుల్లో భక్తులు, మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి పరిచారకులు తిరుచూర్ణ, సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని అందరిపై చల్లారు. ఆలయానికి చేరుకున్న దేవరులకు ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్జిత అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తదితరులు పర్యవేక్షించారు.

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న మెయిన్ రోడ్డు



వడదెబ్బకు గురై ప్రభుత్వాస్పత్రిలో సెలైన్ పెట్టుకుంటున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడిమికి గురై ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వడదెబ్బకు గురై ఆస్పత్రుల్లో చేరి సెలైన్లు పెట్టుకుంటున్నారు. ఐదు నెలలకు పైగా వర్షం లేకపోవడంతో ఎన్నడూ లేనివిధంగా ఎండలు కాస్తున్నాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు పడేవని ఈదఫా వర్షాలు పడకపోవడంతో ఎండ వేడిమి ఎక్కువగా ఉందని ప్రజలు అంటున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక ఇంటిలో నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఎండవేడిమితో ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే బాగుంటుందని, వాతావరణం చల్లబడితే ఎండ తగ్గుతుందని ప్రజలు అంటున్నారు.

ట్రాఫిక్ వలయంలో రేణిగుంట



నో పార్కింగ్ బోర్డు ఉన్నా నిలిపిన వాహనాలు



రేణిగుంటలోని శ్రీకాళహస్తి మార్గంలో టిఫిన్ సెంటర్ల వద్ద నిలిచిపోయిన వాహనాలు

రేణిగుంట: రేణిగుంటలో ట్రాఫిక్ సమస్య పోలీసులకు సవాలుగా మారుతోంది. ప్రధాన కూడళ్లలో, ఆర్‌టీసీ బస్టాండు, మెయిన్ బజారు వీధి, శ్రీకాళహస్తి మార్గంలోని టిఫిన్ సెంటర్ల కూడలిలో ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డుపైనే పార్క్ చేయడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా ఉదయం శ్రీకాళహస్తి మార్గంలోని టిఫిన్ సెంటర్ల కూడలి వద్ద పెద్దసంఖ్యలో బైక్‌లు, కార్లు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు పెట్టినా ఖాతరు చేయకుండా వాహనాలను రోడ్డుకు రెండు వైపులా పార్కింగ్ చేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. దీనికితోడు ప్రధాన వీధుల్లో మినరల్ వాటర్ బండ్లు రోడ్డుపైనే పెట్టి క్యాన్లకు నీళ్లను పడుతూ ట్రాఫిక్ సమస్యను మరింతగా పెంచుతున్నారు. రేణిగుంట అర్బన్ పోలీసు అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

‘ఉపాధి’ లక్ష్యాలను అధిగమించాలి

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని పల్లం పంచాయతీలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు లేవని, కూలీలు ఉపాధి హామీ పనులకు విరివిగా వస్తారన్నారు. సిబ్బంది కూలీలతో ప్రతి రోజూ మాట్లాడి పనులకు వచ్చేలా చూడాలన్నారు. రోజూ రూ.300 వేతనం వచ్చేలా కొలతలను ఇచ్చి వారితో ఆ పనులు చేయించాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ఉదయం 6 నుంచి పనులు ప్రారంభించి 10 గంటలకు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. ఏర్పేడు మండలంలో రోజూ 4 వేల మంది కూలీలు తగ్గకుండా పనులు చేయాలన్నారు. ఉపాధిహామీలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, సీడీసీఎల్ఆర్సీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



పల్లంలో పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్



ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ